క్లుప్తంగా

బాడీ బిల్డింగ్ ట్రోఫీల ఆవిష్కరణ

అమలాపురం టౌన్: ఈ నెల 12న నిర్వహించనున్న బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీలకు సంబంధించి ట్రోఫీలను సోమవారం స్థానిక హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో ఆఫీసర్స్ క్లబ్ కార్యనిర్వాహక కార్యదర్శి రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్ ఆవిష్కరించారు. పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటిద్దు వెంకన్నాయుడు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, నగభేరి కృష్ణమూర్తి, గారపాటి శేఖర్, జి.గణేష్‌బాబు పాల్గొన్నారు.

డాక్టర్ రాధమ్మకు సత్కారం



డాక్టర్ రాధమ్మను సత్కరిస్తున్న యోగాశ్రమ గురువు డాక్టర్ శ్రీనివాస్ తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమం రెండో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం జరిగిన వేడుకల్లో సమాజ సేవకురాలు డాక్టర్ రాధమ్మను యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సత్కరించారు. పేద ప్రజలకు భోజనాల ఏర్పాటు, దుప్పట్ల పంపిణీ తదితర సేవా కార్యక్రమాలు చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్‌ను వక్తలు అభినందించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐలు మనోహర్ జోషి, కేవీవీ సత్యనారాయణ, డాక్టర్ కె.మానస, పుచ్చ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజరాజ నరేంద్ర విశిష్ట సేవా పురస్కారం



రాజరాజ నరేంద్ర విశిష్ట సేవా పురస్కారం అందుకుంటున్న డాక్టర్ పద్మజ

అమలాపురం రూరల్: రాజమహేంద్రవరంలో రాజరాజ నరేంద్రుల పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాల సందర్భంగా జరిగిన రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో గుజరాత్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రరాయ్, సినీనటుడు గౌతమ్‌రాజుల చేతుల మీదుగా ఎస్‌కేబీఆర్ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ కేటీ పద్మజ రాజరాజ నరేంద్ర విశిష్ట సేవా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పద్మజను ఎస్‌కేబీఆర్ కళాశాల కళాశాల పాలక వర్గ అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు, సభ్యులు డీఎస్ఎన్ రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కుమారశాస్త్రి తదితరులు అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడుకి సత్కారం



ఉత్తమ ఉపాధ్యాయుడు పుల్లయ్యశెట్టి దంపతులను సత్కరిస్తున్న నాయకులు, గ్రామస్తులు

అల్లవరం: అంకితభావంతో విధులు నిర్వర్తించే ఉద్యోగులు ప్రజల హృదయాల్లో ఎప్పుడూ చిరస్థాయిగా ఉంటారని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. గూడాల ఎంపీపీ పాఠశాలలో సర్పంచ్ దాకారపు చిరంజీవి అధ్యక్షతన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుత్తుల పుల్లయ్యశెట్టి దంపతులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకటరావు, పోలిశెట్టి భాస్కరరావు, పోలిశెట్టి వెంకటేశ్వరరావు, నంధ్యాల రామారావు, రాకూర్తి జయ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి ప్రశంసా పత్రం

యానాం: రాజమహేంద్రవరంలో జరుగుతున్న రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలు-2024లో యానాంకు చెందిన కవయిత్రి, స్థానిక గిరియాంపేట ప్రభుత్వ హైస్కూల్ జీవశాస్త్ర ఉపాధ్యాయిని ఓలేటి మహాలక్ష్మి ప్రశంసా పత్రం అందుకున్నారు. కవి సమ్మేళనంలో పాల్గొని తన కవితలతో ఆహూతుల మన్ననలు అందుకున్న మహాలక్ష్మిని సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం దంగేటి త్రిమూర్తులు తదితరులు ఆమెను అభినందించారు.

రాష్ట్ర చెస్ టోర్నమెంట్ విజేత సాత్విక్

అమలాపురం రూరల్: ఈ నెల 4, 5 తేదీల్లో అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో పాలిటెక్నిక్ డిప్లొమా రెండో ఏడాది చదువుతున్న ద్రాక్షారాపు సాత్విక్ టోర్నమెంట్ విజేతగా నిలిచాడని భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల పీడీలు తెలియచేశారు. ఈ సందర్భంగా సాత్విక్‌ను బీవీసీ విద్యా సంస్థల చైర్మన్ బోనం కృష్ణ సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీసీ రామారావు, ప్రిన్సిపాల్ ఫణి శంకర్ అభినందించారు.

అర్హులందరికీ పింఛన్లు అందజేయడమే లక్ష్యం

ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



ముమ్మిడివరంలో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ తదితరులు



లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

ముమ్మిడివరం: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం రూరల్, నగర పంచాయతీల్లో నూతనంగా మంజూరైన పింఛన్లను 346 మంది లబ్ధిదారులకు సోమవారం ఆయన అందజేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పదో తరగతి స్టడీ మెటీరియల్, ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని ఎత్తుగడలు వేసినా రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, మళ్లీ జగన్ సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సుమారు 30 సంక్షేమ పథకాలతో పేదరికం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలని సీఎం జగన్ ప్రయత్నిస్తున్నారని చెప్పారు. సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, వైస్ చైర్మన్ వేటుకూరి బోసురాజు, కోలా గంగాభవాని, కుడిపూడి శివశంకరరావు, కోలా బాబ్జి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, కాశి బాలమునికుమారి, మండల పార్టీ కన్వీనర్ జగతాపద్మనాభం, రెడ్డి శివన్నారాయణ, వైస్ ఎంపీపీలు పాము నాగవేణి, మట్టపర్తి సురేష్, కమిషనర్ జి.లోవరాజు, ఎంపీడీఓ జె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

అల్లవరం: వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. సోమవారం గోడిలోని తన నివాసంలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం అంచెలంచెలుగా పెన్షన్ పెంచుతూ ఈ నెల నుంచి రూ.3 వేలు అందిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబ పెద్దగా, కొడుకుగా ఉంటూ నిరుపేదల జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తుంటే ప్రతిపక్షాలు నిజాలు తెలుసుకోకుండా ప్రజలను మభ్య పెట్టడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందినవారు ప్రతిపక్షాల కుట్రను తిప్పికొట్టాలన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌ని ఆదరించి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మండలంలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు ఎంపీపీ మోర్త మిరియాం జ్యోతి సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, సర్పంచ్ దంతులూరి రాఘవరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతిరాజు, ఢిల్లీ నారాయణ, బాబ్జిరాజు, ఏలూరి ఆదినారాయణ, కాటం సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



గాడిమొగలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంపీపీ సునీత తదితరులు



కందికుప్ప జెడ్పీహెచ్ పాఠశాలలో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ నేల కిషోర్‌కుమార్

తాళ్లరేవు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యమిచ్చి అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంపీపీ రాయుడు సునీత కోరారు. సోమవారం మండలంలోని వివిధ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. పటవల, చినబొడ్డు వెంకటాయపాలెం, గాడిమొగ, లక్ష్మీపతిపురం, పిల్లంక, ఇంజరం తదితర పాఠశాలల్లో ప్రభుత్వం ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. మండలంలో ఈ ఏడాది 8వ తరగతి చదువుతున్న 1004 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి లలిత నాగరాజు, సర్పంచ్‌లు ముద్దన వెంకట శివరామ ప్రసాద్, కామాడి గోవలక్ష్మి, పెయ్యల మంగేష్, ఎంపీటీసీ సభ్యులు పోతుల రత్నకుమారి, పాలెపు పోశియ్య పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు నాణ్యమైన చదువులు

కాట్రేనికోన: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ధ్యేయంతో నాడు-నేడుతో కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని జెడ్పీటీసీ సభ్యుడు నేలకిషోర్ అన్నారు. కందికుప్ప, సాపేవారిపల్లి జెడ్పీహెచ్ పాఠశాలల్లో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన ట్యాబ్‌లను జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్‌కుమార్ పంపిణీ చేశారు. అనంతరం పల్లంకుర్రు సాపేవారి పేట జెడ్పీహెచ్ పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలను పరిశీలించారు. కార్యక్రమాల్లో చల్లగల వెంకట లక్ష్మి, నాతి అలివేణి, నల్లా నరసింహమూర్తి, నాతి సత్యనారాయణ, చల్లగల అప్పారావు, యేడిది సుబ్బారావు, కాశి హనుమంతరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గౌతమి

అల్లవరం: పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు బాగా చదివి జిల్లాల్లో అల్లవరం మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. జగనన్న విద్యాభారతి కార్యక్రమంలో భాగంగా కోడూరుపాడు, అల్లవరం, సామంతకుర్రు ఉన్నత పాఠశాలల్లో జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమితో కలిసి ఆయన విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు గౌతమి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరనీడి సాయి, ఎంపీటీసీ గుబ్బల రంగనాథ స్వామి, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, జిల్లా యూత్ ప్రధానకార్యదర్శి దాసం రాంబాబు, కొనుకు మహేష్, కర్రి శ్రీను, గుంటూరి సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: నీలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ ఉచిత స్టడీ మెటీరియల్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని హైస్కూల్స్‌లో 1007 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పెయ్యల మంగేష్, కామాడి గోవలక్ష్మి, ముద్దన ప్రసాద్, చిట్టూరి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో విద్యార్థినులు

ఉప్పలగుప్తం: మండలంలోని పలు పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు వైభవంగా జరిగాయి. గొల్లవిల్లి, భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు సోమవారం సంప్రదాయ దుస్తులు, వివిధ వేషధారణలతో అలరించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థినులు వేసిన ముగ్గులు ఆకర్షణీయంగా నిలిచాయి. గంగిరెద్దుల విన్యాసాలతో, భోగి మంటలతో విద్యార్థులు ఉత్సాహంగా సందడి చేశారు. అనంతరం భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు ఎంపీటీసీ సభ్యులు దేశంశెట్టి నాగరత్నకుమారి, నాగులపల్లి శేషవేణి సమకూర్చిన బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యిల రాజ్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు, హెచ్ఎంలు లంకా రాణి, నూకల సత్యనారాయణ, పీడీలు గొలకోటి ఫణి, కామన మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

సాకుర్రులో సంక్రాంతి సంబరాలు

అమలాపురం రూరల్: మండలంలోని సాకుర్రు బాలకృష్ణనగర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం భోగి మంట వెలిగించి సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు. ముగ్గుల పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సంక్రాంతి సంబరాల్లో సర్పంచ్ గుత్తుల చిరంజీవి, వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, ఎంఈవో వై.సూర్యప్రకాశం, స్కూల్ కమిటీ చైర్మన్ విప్పర్తి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, పాలమూరి ధర్మపాల్, మాజీ సర్పంచ్ చొల్లంగి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా చెరువుల తవ్వకాలపై ఫిర్యాదు



ఎస్.రామేశ్వరంలో మడ అడవులను తొలగించి చెరువులు చేస్తున్న దృశ్యం

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నం శివారు ఎస్.రామేశ్వరంలో వందలాది ఎకరాల్లో విస్తరించిన మడ అడవుల మధ్య అనధికార ఆక్వా చెరువుల తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. తీర ప్రాంతానికి రక్షణగా ఉంటున్న మడ అడవులను తొలగించి రొయ్యల చెరువులుగా మార్చుతున్నారు. ఇప్పటికే వందలాది ఎకరాల్లో మడ అడవులు కబ్జాకు గురయ్యాయి. ఉన్న కొద్దిపాటి మడ అడవులను సైతం తొలగించి ప్రొక్లెయిన్‌ల సాయంతో చెరువులు చేస్తున్నారు. మడ అడవుల మధ్య నుంచి మురుగు నీరు సముద్రానికి దిగే నదీ పాయని కూడా కబ్జాదారులు ఆక్రమించుకుని చెరువుల సాగు చేస్తున్నారు. గత కొంత కాలంగా ఇదే తంతు సాగుతున్నా రెవెన్యూ అధికారులు, మత్స్యశాఖాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మడ అడవుల్లో అనధికార చెరువులపై ఎస్.రామేశ్వరం గ్రామానికి చెందిన పంతాడి సత్తిబాబు, అంగాడి విష్ణు అమలాపురంలోని జరిగిన స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ముగిసిన ప్రజా ఉత్సవాలు



ముగింపు వేడుకల్లో అలరించిన నృత్య ప్రదర్శన

యానాం: 20వ యానాం ప్రజా ఉత్సవాలు సోమవారంతో ముగిసాయి. స్థానిక బాలయోగి స్టేడియంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడికృష్ణారావు, ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, మున్సిపల్ కమిషనర్ అరుణ్ ప్రకాశం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిమిక్రీ, సినీ నేపథ్య గాయకులతో ఆర్కెస్ట్రా నిర్వహించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఎమ్మెల్యే ఎందుకు రాలేదు?

ప్రజా ఉత్సవాలు జరిగిన మూడు రోజులూ వేదిక్పై నియోజకవర్గ శాసనసభ్యుడు గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ లేకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. కారైకల్‌లో నిర్వహించినట్లుగా యానాంలో బీచ్ ఫెస్టివల్ చేద్దామని ఎమ్మెల్యే అశోక్ సూచించినా అధికారులు మాత్రం అదేమీ పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించడంతో ఆయన అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తుంది. అధికారుల సహాయ నిరాకరణ ధోరణిపై చట్టసభ దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే అశోక్ తన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు సమాచారం.

మంత్రికి వినతి పత్రం



మంత్రి విశ్వరూప్‌కు వినతి పత్రం అందిస్తున్న సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు

అమలాపురం రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్‌కు సమగ్ర శిక్ష ఉద్యోగులు కోరారు. ఈ మేరకు భట్నవెల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన్ని కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న తమను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, ఉద్యోగులందరికీ హెచ్ఆర్ పాలసీ ఇవ్వాలని అడిగారు. దీనిపై మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై సీఎం జగన్‌తో మాట్లాడుతామని తెలిపారు. ప్రభుత్వానికి కొంత సమయం కావాలన్నారు. మంత్రిని కలిసినవారిలో రాష్ట్ర జేఏసీ నాయకులు ఏవీ నాగేశ్వరావు, జిల్లా జేఏసీ నాయకులు వెంకట్, శ్రీను, ఎం.వెంకటేశ్వరరావు, షేక్ రెహమాన్, జి.నాగన్న, త్రినాథ్, నాగమల్లేశ్వరరావు, గోపాలరావు తదితరులున్నారు.

డ్రెయిన్‌లో పడిపోయిన ఆవు



యానాం: స్థానిక సబ్ జైలు వెనుక సోమవారం సాయంత్రం ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడిపోయిన ఆవును స్థానిక ఫైర్‌స్టేషన్ సిబ్బంది బయటకు తీసి రక్షించారు. మేతకు వెళ్లిన ఆవు అనూహ్యంగా అయిదడుగుల లోతున్న డ్రెయినేజీలో పడిపోయింది. పైగా అది నిర్మానుష్యంగా ఉండే ప్రాంతం కావడంతో ఆవు చాలా సేపు డ్రెయిన్‌లోనే ఉండిపోయింది. అయితే అటుగా వెళుతున్న జైలు సిబ్బంది గమనించి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని తాళ్ల సహాయంతో అతి కష్టం మీద ఆవును ఒడ్డుకు చేర్చారు.

డ్రెయిన్‌లో పడిన ఆవును బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సొసైటీలను బహుళార్థ సేవా కేంద్రాలుగా తీర్చిదిద్దాలి

అల్లవరం: సహకార సంఘాలను బహుళార్థ సేవా కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో సోమవారం మెగా కాన్‌క్లేవ్ నిర్వహించారని ఏపీ అగ్రి మిషన్ సభ్యులు, దేవగుప్తం సొసైటీ చైర్మన్ జున్నూరి రామారావు తెలిపారు. జిల్లాలో అల్లవరం మండలంలో దేవగుప్తం, కొమరగిరిపట్నం సొసైటీలు, ఐ.పోలవరం మండలంలో టి.కొత్తపల్లి, రాజోలు మండలం నుంచి రాజోలు సొసైటీకు మెగా కాన్‌క్లేవ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందిందన్నారు. కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ముఖ్య అతిథిగా హాజరై సహకార సంఘాల్లో ఏర్పాటుచేయనున్న జన ఔషధ కేంద్రాల ఏర్పాటు, వాటి నిర్వహణపై అవగాహన కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అల్లవరం మండలం నుంచి చైర్మన్‌లు జున్నూరి రామారావు, గుర్రం బాబులు, సీఈఓలు కొమ్మూరి సత్తిబాబు, నాయుడు హాజరయ్యారు.

ఉత్సాహంగా వికసిత్ భారత్

తాళ్లరేవు: స్థానిక పిల్లంక పంచాయతీ కార్యాలయం వద్ద వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం సోమవారం ఉత్సాహంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ రాయుడు సునీత మాట్లాడుతూ భారతదేశాన్ని ప్రపంచంలోనే అత్యున్నత దేశంగా తీర్చిదిద్దేందుకు భారత ప్రధాని నరేంద్ర మోడీ అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక నృత్యాలు, కోలాటం అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం సంబంధిత పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ పుట్టా వీరప్రసాద్ గాంధీ, ఈఓపీఆర్డీ మల్లాడి భైరవమూర్తి, ఎంఈఓలు ఎ.మంగాయమ్మ, మోకా ఉమ, రాయుడు గంగాధర్, కె.కృష్ణంరాజు పాల్గొన్నారు.

గ్రామ దేవతల ఉత్సవాలు ప్రారంభం

ఉప్పలగుప్తం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండల పరిధి చల్లపల్లిలో ఏటా గ్రామ దేవత మహిషాసురమర్ధిని, మరిడ మహాలక్ష్మి, కనక మహాలక్ష్మి అమ్మవార్ల జాతర్లు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా సోమవారం మహిషాసురమర్ధిని అమ్మవారిని గ్రామంలోకి ఆహ్వానించే ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాల నడుమ అమ్మవార్ల ఘటాలను ఊరేగించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

అమలాపురం రూరల్: కలెక్టరేట్ వద్ద వద్దిపర్రుకు చెందిన కొండేపూడి జ్యోతి అనే మహిళ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. ఉప్పే బాపిరాజు అనే వ్యక్తి తనపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నాడంటూ సోమవారం కలెక్టరేట్ వద్ద పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునేందుకు ప్రయత్నించగా అక్కడే ఉన్న వాచ్‌మన్ అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. కోళ్ల ఫారం ఏర్పాటుకు రూ.3 కోట్ల రుణం ఇప్పిస్తానంటూ జ్యోతి రూ.53 లక్షలు తీసుకుని మోసం చేసిందని బాపిరాజు కోర్టును ఆశ్రయించడంతో అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఆత్రేయపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలోనే జ్యోతి ఆత్మహత్యకు యత్నించినట్లుగా తెలుస్తుంది.

బకాయి జీతాలు చెల్లించాలి

ఎంపీ వైథిలింగం

యానాం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలందిస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి 44 నెలలుగా అందించాల్సిన బకాయి జీతాలను విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్ఏఓ మునిస్వామిని పుదుచ్చేరి ఎంపీ వైథిలింగం సోమవారం ఆదేశించారు. స్థానిక జీజీహెచ్ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది గత కొద్దిరోజులుగా బకాయి జీతాలు కోసం ఆందోళన బాట పట్టిన నేపథ్యంలో ఆయన ఈ మేరకు లేఖ రాశారు. యానాం మల్టీపర్పస్ ప్రొవైడర్స్ కోపరేటివ్ సొసైటీ ద్వారా 2011 నుంచి అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సేవలందిస్తున్నా ఆగస్టు 2020 నుంచి జీతాలు ఇవ్వడం లేదని లేఖలో పేర్కొన్నారు.

ఆరోగ్యశ్రీతో మెరుగైన వైద్య సేవలు



విలసవిల్లిలో ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంతో ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. మండలంలోని విలసవిల్లి పంచాయతీ పరిధిలో అర్హులైన వారికి ఆరోగ్యశ్రీ కార్డులను ఆమె సోమవారం పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ పథకంలో 3257 వ్యాధులకు రూ.25 లక్షల ఖర్చు వరకూ ప్రభుత్వమే భరిస్తుందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, బొంతు రాజేష్, చిట్టూరి వెంకట్రావు, నాగరాజు, ఆశపు బుజ్జి, వలంటీర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనకు పలువురి సంఘీభావం

యానాం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది గత కొద్దిరోజులుగా తమ బకాయి జీతాల కోసం చేస్తున్న ఆందోళనకు కలైమామణి అవార్డు గ్రహీత పొనుగుమట్ల విష్ణుమూర్తి, బీజేపీ అధ్యక్షుడు కనకాల రాజు, కాంగ్రెస్ నేత మల్లాడి సత్తిబాబు, కాకి నాగేశ్వరరావు తదితరులు సోమవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 44 నెలలుగా అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు ఇవ్వకుండా పనిచేయించుకోవడం అన్యాయమన్నారు.

అంగన్‌వాడీలు తక్షణమే విధుల్లోకి రావాలి

ముమ్మిడివరం: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ అంగన్‌వాడీలు తక్షణమే విధులకు హాజరుకావాలని స్త్రీ, శిశు సంక్షేమ, మహిళా సాధికారిత అధికారి జీవీ సత్యవాణి సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వ జీఓ ఆర్‌టీ నెంబర్-2 ప్రకారం అంగన్‌వాడీలు ఆరు నెలల పాటు సమ్మె చేయరాదని ఏపీ ప్రభుత్వ మహిళా శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసినందున అంగన్‌వాడీలు తక్షణమే సమ్మె విరమించి విధుల్లో చేరకపోతే కలెక్టర్ ఆదేశానుసారం చర్యలు తీసుకుంటామన్నారు.

కేసుల ఎత్తివేతపై దళిత నేతల ఆందోళన



ఆందోళన చేస్తున్న జిల్లా దళిత ఐక్య వేదిక ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం అల్లర్ల కేసుల ఎత్తివేతను వ్యతిరేకిస్తూ కోనసీమ దళిత నేతలు స్థానిక గడియారం స్తంభం సెంటరులో జిల్లా దళిత ఐక్య వేదిక, దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. అమలాపురం విధ్వంసం కేసుల ఎత్తివేత జీవోను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో జిల్లా దళిత ఐక్య వేదిక చైర్మన్ డీబీ లోక్, కన్వీనర్ జంగా బాబూరావు, ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, మెండు రమేష్‌బాబు, నక్కా సంపత్‌కుమార్, రేవు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కిట్ల పంపిణీ

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ కార్యాలయం వద్ద ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మంజూరైన క్రికెట్, వాలీబాల్ కిట్లను ఎంపీపీ రాయుడు సునీత క్రీడాకారులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ, ఉప సర్పంచ్ లోకేష్ పాల్గొన్నారు.